క్లుప్తంగా

సేవా వజ్ర షేక్ హసీనాకు ఘన సన్మానం



సేవా వజ్ర పురస్కారం పొందిన షేక్ హసీనాను అభినందిస్తున్న ముస్లింలు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు చేరవేయడంలో కీలకంగా పనిచేస్తున్న వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం పురస్కారాల ప్రదానంలో భాగంగా మండలంలో సర్పవరం గ్రామానికి చెందిన షేక్ హసీనా సేవా వజ్ర అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి కరీం బాషా ఆధ్వర్యంలో ముస్లింలు శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం కార్యదర్శి ఎండీ ఖాజా, అన్సారీ బేగ్, షేక్ షహెంషా, పాషా, షేక్ రేష్మా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవం ప్రారంభానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కరప: యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామివారి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ వంశపారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం పూజాదికాలు చేశారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి, బాణసంచా కాల్పులతో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ పీఎస్‌వీ సూర్యనారాయణ రాజు, కె.రఘు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతు, కార్మిక సంఘాల ధర్నా

కాకినాడ సిటీ: చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో రెండో దఫా రైతాంగం మొదలుపెట్టిన ఉద్యమంపై హర్యానా బీజేపీ ప్రభుత్వం పోలీసులతో కాల్పులు జరిపించడంతో 23 ఏళ్ల యువ రైతు మృతి చెందిన ఘటనకు నిరసనగా రైతు, కేంద్ర కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. మోదీ తెచ్చిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం చేసిన 15 నెలల పోరాటం సందర్భంగా, మోదీ ప్రభుత్వం దేశ రైతాంగానికి క్షమాపణలు చెబుతూ ఇచ్చిన హామీలు మూడేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. గత పదేళ్ల కాలంలో మోదీ విధానాల ఫలితంగా 1.60 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళనకారులు వివరించారు. వివిధ సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, రాజశేఖర్, టేకుమూడి ఈశ్వరరావు, వల్లూరి రాజాబాబు, చెక్కల రాజ్‌కుమార్, దూసర్లపూడి రమణరాజు, టి.రాజా, రొంగల ఈశ్వరరావు, జుత్తుక శ్రీను, బొజ్జా ఐశ్వర్య, కేశవరపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'తప్పుడు సమాచారంతో టిక్కెట్ ఆపుతారా?'

కాకినాడ రూరల్: తన కుటుంబ తగాదాను కొందరు అధిష్టానం వద్ద తప్పుడు సమాచారమిచ్చి టిక్కెట్ ఆపించేందుకు యత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఆమె భర్త వీరవెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. వలసపాకలలోని తమ నివాసంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఒకదశలో టిక్కెట్ ఆపగలరు కానీ, ప్రాణం తీయలేరు కదా అని ఆవేశంగా వ్యాఖ్యానించారు. టీడీపీలోని కొందరు బీసీ నాయకులు గురువారం తనకు మద్దతుగా టిక్కెట్ ఇవ్వాలని మాట్లాడితే, దానిని వక్రీకరించి రాశారని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేనతో పొత్తులో భాగంగా కాకినాడ రూరల్ సీటు ఎవరికిచ్చినా అందరూ కలిసి పని చేస్తామన్నారు. రెండు పార్టీలు కలిసి ఉన్నప్పుడు, నాయకులు కూడా కలిసి ఉండాలన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు



పేడ్డ ప్రకాశరావు (ఫైల్)

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ఓ వృద్ధుడి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్ అబ్దుల్ కలామ్ మార్గ్‌కు చెందిన 83 ఏళ్ల పేడ్డ ప్రకాశరావు ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి, తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద, బంధువుల ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అతను 5.2 అడుగుల ఎత్తు, చామన ఛాయ మేని వర్ణంతో ఉంటారు. ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కుంకుమ రంగు లుంగీ, ఖద్దరు బనియన్, గోధుమ వర్ణం స్వెట్టర్ ధరించి ఉన్నారని కాకినాడ టూ టౌన్ సీఐ నాగేశ్వర్ నాయక్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 79891 21001, 94407 96541 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పేదలకు పండగ

- ఫంక్షన్ హాళ్లుగా సామాజిక భవనాలు
- కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబు కృషి
- అన్ని వర్గాల వారికీ అందుబాటులోకి..
- ఒక్క వలసపాకలలోనే రూ.కోటితో మత్స్యకారుల భవనం



ఎమ్మెల్యే కన్నబాబు కృషితో కాకినాడ రూరల్ వలసపాకలలో కోరమండల్ సీఎస్‌ఆర్ నిధులతో అత్యంత సుందరంగా నిర్మించిన మత్స్యకార ఫంక్షన్ హాలు

కాకినాడ రూరల్: పేదింట పెళ్లి భజంత్రీలు మోగాలన్నా.. శుభకార్యాలు జరగాలన్నా.. లక్షల రూపాయలు పోసి ప్రైవేట్ కల్యాణ మండపాలు అద్దెకు తీసుకునే స్తోమత లేని వివిధ సామాజిక వర్గాల ప్రజలకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అండగా నిలిచారు. నియోజకవర్గంలో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 80 వరకూ సామాజిక భవనాల నిర్మాణానికి నిధులు సమకూర్చడంతో పాటు, కొన్నింటికి కర్మాగారాల సీఎస్‌ఆర్ నిధులు రాబట్టారు. దీంతో ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లకు ఏ మాత్రం తీసిపోని విధంగా సామాజిక భవనాలు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని నిర్మాణ తుది దశలో.. శరవేగంగా ప్రారంభోత్సవం కోసం ముస్తాబు అవుతున్నాయి. రెండు రోజుల క్రితం వలసపాకల గ్రామంలో మత్స్యకారులు తమ పిల్లలు పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లు, సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు కోరమండల్ నిధులు సుమారు రూ.కోటితో నిర్మించిన ఫంక్షన్ హాలును ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభించి, అందుబాటులోకి తీసుకువచ్చారు. రెండు అంతస్తుల భవనం అత్యంత సుందరంగా రూపుదిద్దుకుని అందుబాటులోకి తీసుకురావడంతో మత్స్యకార సామాజికవర్గ మహిళలు ప్రభుత్వానికి, కన్నబాబుకు రుణపడిపోయామని ఆనంద భాష్పాలు విడిచారు. మరుసటి రోజే వాకలపూడిలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన గౌడ సామాజిక భవనాన్ని ప్రారంభించి, వారి కలనూ సాకారం చేశారు. ఎస్సీలు, బీసీలతో పాటు, కాపులు, ఆర్యవైశ్యులు, శెట్టిబలిజ, యాదవ, ఇతర సామాజిక వర్గాల వారికీ భవనాలు నిర్మించారు. తమ్మవరం గ్రామంలో చేనేత కార్మికుల కోసం సంక్షేమ భవనాన్ని అత్యంత ఆధునికంగా నిర్మించి, అందుబాటులోకి తెచ్చారు.



వలసపాకలలో అందుబాటులోకి వచ్చిన మత్స్యకార ఫంక్షన్ హాలు లోపలి భాగం

రూరల్ మండలంలోని చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్న తమ్మవరంలో విలువైన స్థలం కేటాయించి, ఫంక్షన్ హాలు నిర్మించడంతో వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

> **రుణపడిపోయాం**
>
> 
>
> వలసపాకల గ్రామంలో కలలో ఊహించని విధంగా ఫంక్షన్ హాలును నిర్మించారు. మత్స్యకారులకు వందేళ్ల పాటు సేవలందించేలా నిర్మాణం చేపట్టారు. తరతరాలు గుర్తుండిపోయేలా ఫంక్షన్ హాలును అందుబాబులోకి తీసుకువచ్చిన ఎమ్మెల్యే కన్నబాబుకు రుణపడిపోయాం. మత్స్యకారులంతా ఆయనకు అండగా ఉంటాం.
>
> – వీరమణి, మత్స్యకార మహిళ, వలసపాకల గ్రామం
>
> **శాశ్వతంగా గుర్తుండిపోయేలా..**
>
> 
>
> మనం చేసిన సేవలే గుర్తింపునిస్తాయి. పేదల సంక్షేమం, అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తూ పనిచేశాను. ఐదేళ్లలో గతంలో ఎవ్వరూ నిర్మించని విధంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సామాజిక భవనాల నిర్మాణం చేపట్టాం. సుమారు 80 సామాజిక భవనాలు నిర్మించడంతో, ఆయా సామాజిక వర్గ ప్రజలు శుభకార్యాలు ఉచితంగానే జరుపుకొనే అవకాశం ఏర్పడింది. ప్రజలకు సేవలు చేస్తూ ముందుకు సాగుతున్నాను. వారి దీవెనలు కోరుకుంటున్నాను.
>
> – కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే, కాకినాడ రూరల్

గృహ నిర్మాణాల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

కాకినాడ రూరల్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం కింద జగనన్న కాలనీ నేమాం–3 లే అవుట్‌లో నిర్మిస్తున్న గృహాలను హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడారు. గృహ రుణం, మెటీరియల్ తదితర వాటిపై ఆరా తీశారు. గృహ నిర్మాణాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు, సీఎం వైఎస్ జగన్‌మోమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కన్నబాబుకు ధన్యవాదాలు తెలిపారు. హౌసింగ్ ఏఈ నాగభూషణం ఆయన వెంట ఉన్నారు.

25న ఉద్యోగుల సంఘ ఎన్నికలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు ఈ నెల 25న కాకినాడ రెవెన్యూ భవనంలో నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి పి దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఏపీజేఏసీ అమరావతిలో సభ్య సంఘమైన ఆల్ ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ మల్లేశ్వరరావును, తనను ఎన్నికల అధికారులుగా నియమించినట్టు చెప్పారు. ఆదివారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ భవన్‌లో ఎన్నికల నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన మైనార్టీ సెల్ ప్రతినిధులు

కాకినాడ: అన్ని విధాలా ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం పలువురు ముస్లిం మైనార్టీలకు చెందిన ప్రతినిధులు ఎమ్మెల్యే ద్వారంపూడిని ఆయన నివాసంలో కలిశారు. కాకినాడలో ముస్లిం మైనార్టీల కోసం సుమారు రూ.12 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేస్తున్న వారిని గుర్తించి వివిధ పదవుల్లో నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు సంబంధించి ఇప్పటికే కొత్తగా రెండు మసీదుల నిర్మాణంతో పాటు, మరెన్నో అభివృద్ధి పనులు చేపట్టి సంతృప్తికరమైన సేవలు అందజేయగలిగానన్నారు. మైనార్టీలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ జోనల్ ఇన్‌చార్జి అబ్దుల్ బషీరుద్దీన్ ఆధ్వర్యంలో వీరంతా ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా సంయుక్త కార్యదర్శులు కరీముద్దీన్, అబ్దుల్ రహీమ్, ప్రభుత్వ ఖాజీ గౌస్‌మోహిద్దీన్, నాయకులు ఎండీ హుస్సేన్, మౌలాలీ, ఎండీ తానీషా, రుస్తుం, బాషా, అబ్దుల్ ఖలీల్, రఫీ, కరీమ్, ఖాజా, మొహిద్దీన్, షరీఫ్, ఇషాక్ తదితరులు ఉన్నారు.

రోటరీ స్మార్ట్ సిటీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్ 119వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రోటరీ స్మార్ట్ సిటీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి రోటరీ సహాయమందిస్తూ, సమాజాభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. సరైన సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. నేటికీ రక్తదానంపై ప్రజల్లో అపోహ ఉండడం దురదృష్టకరమన్నారు. సీనియర్ రోటరీ సభ్యులు బ్లూ స్టార్ రవి మాట్లాడుతూ రోటరీ స్మార్ట్ సిటీ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను నెరవేరుస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామరాజు, క్లబ్ కార్యదర్శి స్వామిశేఖర్, సంయుక్త కార్యదర్శి డీవీఎస్ శ్రీలక్ష్మి, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె సూర్యనారాయణ పాల్గొన్నారు.

విచారణకు త్రిసభ్య కమిటీ

కాకినాడ క్రైం: మెడికల్ ఇన్‌వాలిడేషన్‌లో అవకతవకలకు పాల్పడి, అడ్డదారిలో ఉద్యోగం సంపాదించాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కాకినాడ జీజీహెచ్ గ్రేడ్–2 మెకానిక్ కిల్లారి సురేంద్రరాజు నియామక వ్యవహారం నిగ్గు తేల్చేందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటైంది. కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలతో ఈ కమిటీని నియమించినట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ తెలిపారు. సురేంద్ర తండ్రి, జీజీహెచ్ మాజీ ఎంఎన్‌ఓ పాత్రుడు తనకు అనారోగ్యం లేకపోయినా కూడా, అదే సాకు చూపుతూ తన ఉద్యోగాన్ని కుమారుడికి బదలాయించాడని, అందుకు పలువురు అధికారులు సహకరించారని, అలాగే విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణల నేపథ్యంలో ఆయా అంశాలపై కమిటీ విచారణ చేపట్టనుందన్నారు. సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ పుష్కరరావు, ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్‌ను కమిటీ సభ్యులుగా నియమించినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. వారం రోజుల వ్యవధిలో బృందం నివేదిక అందించనుందని, నియామక ప్రక్రియ, అవినీతి ఆరోపణలకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ అంశాలను పొందుపరిచే ఆ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని డాక్టర్ విఠల్ వెల్లడించారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు



వెండి, బంగారు పుష్పాలతో అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో కార్తిక మాస ద్వాదశి పూజల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు, బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య వైభవంగా హోమాన్ని జరిపించారు.

తీరంలో ఏర్పాట్ల పరిశీలన



ఉప్పాడ తీర ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

కొత్తపల్లి: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు జాగ్రత్తలు పాటించాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఉప్పాడ తీర ప్రాంతంలో పుణ్యస్నానాల ఏర్పాట్లను ఎస్సై స్వామి నాయుడుతో కలిసి శుక్రవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించాలన్నారు. భక్తులు తమ పిల్లలు, వృద్ధులు, విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. స్నానాలు చేసేందుకు కెరటాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు భక్తులకు అవసరమైన తాగునీరు, ఇతర వసతులు ఏర్పాటు చేశారన్నారు. పోలీసులు, అధికారులకు భక్తులు సహకరించాలని కోరారు.

భూసార పరీక్షలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న పీడీ

పెద్దాపురం: విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన అవసరమని కాకినాడ జిల్లా ఆత్మ పీడీ జ్యోతిర్మయి అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో శుక్రవారం భూసార పరీక్షల నిర్వహణ, సేంద్రియ సాగు పద్ధతులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.కమలం అధ్యక్షత వహించారు. పీడీ జ్యోతిర్మయి మాట్లాడుతూ విద్యార్థులకు వ్యవసాయ రంగంపై పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతిఒక్కరూ సేంద్రియ ఆహార పంటలను తీసుకోవాల్సి ఉందన్నారు. విద్యార్థులకు సేంద్రీయ సాగు పంటలు, సారవంత నేలలు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ రంగ శాస్త్రవేత్తలు, అధికారులు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త నరసింహరావు, ఏడీఏ డీఆర్‌సీ శారద, భూసార పరీక్ష కేంద్రం ఏఓ పవిత్ర, ఏఈఓ ఎస్‌వీవీ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య పాల్గొన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

తొండంగి: మండలంలోని వేమవరం శివారులో సారా బట్టీలపై శుక్రవారం దాడి చేసినట్టు స్థానిక ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వేమవరం శివారు బీచ్‌లో సారా తయారీ చేస్తున్నట్టు సమాచారం రావడంతో గురువారం అర్ధరాత్రి ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. పంపాదిపేటకు చెందిన మైలపల్లి సత్తిబాబును అరెస్టు చేసి, 150 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారయ్యారు. సుమారు 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

సొంతూరులోనే ఉన్నత చదువులు

- హైస్కూళ్లను ఇంటర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం
- ప్రతి మండలానికి రెండు జూనియర్ కాలేజీలు
- పేదలకు మరింత చేరువైన ఇంటర్మీడియెట్
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు



సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న చేబ్రోలు జీజేసీ విద్యార్థులు



చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తరగతులకు హాజరైన విద్యార్థులు

పిఠాపురం: ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేదరికంతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఇప్పటికే అమ్మఒడి, జగనన్న విద్యా కానుక వంటి పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ఉన్నత విద్యను సైతం బాలికలు, పేద విద్యార్థులకు చేరువ చేసింది. ప్రతి మండలానికి రెండు జూనియర్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇక్కట్లు

గతంలో పలు గ్రామాల్లో కేవలం ప్రాథమిక పాఠశాలలే ఉండేవి. హైస్కూల్‌కు వెళ్లాలన్నా పక్క ఊరు, మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. పై చదువులు చదవాలంటే ప్రైవేటు స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లక తప్పేది కాదు. అలాంటి పరిస్థితుల్లో పక్క ఊరు వెళ్లలేక ప్రైవేటు స్కూల్లో చదువుకునే స్తోమత లేక అనేక మంది నిరుపేద పిల్లలు చదువులు ఆపేసే పరిస్థితి. ఇంటర్ చదవాలంటే కొన్ని గ్రామాల నుంచి కిలోమీటర్ల దూరం ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రయాణించాల్సి రావడంతో పాటు, కుటుంబంపై ఆర్థిక భారం పడేది. ఈ నేపథ్యంలో హైస్కూళ్లు అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు కొంతమేర కష్టాలు తప్పాయి. పదో తరగతి అనంతరం పక్క ఊరికి వెళ్లక తప్పని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రతి మండలంలోనూ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేశారు. దీంతో పదో తరగతి తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్న ఊరిలోనే ఇంటర్ పూర్తి చేసే అవకాశం వచ్చిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థినుల ఆనందానికి అవధుల్లేవు. రెండేళ్ల క్రితం పలు జెడ్పీ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ పూర్తి చేస్తున్న విద్యార్థినులు.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ కూడా మా స్కూల్‌లోనే..




నా పేరు ఓరుగంటి లలితాదేవి. మాది గొల్లప్రోలు మండలం చేబ్రోలు. నేను చిన్నప్పటి నుంచి చేబ్రోలు స్కూల్లో చదువుకున్నా. మా ఊళ్లో పదో తరగతి వరకు ఉండడంతో టెన్త్ పూర్తయ్యాక పక్క ఊరు వెళ్లి చదువుకోవాలంటే భయమేసేది. చాలా టెన్షన్ పడేదానిని. కాని సీఎం వైఎస్ జగన్ మావయ్య ముందు చూపుతో ఆలోచించి ప్రభుత్వ హైస్కూళ్లను జూనియర్ కాలేజీలుగా మార్చారు. దీంతో అప్పటివరకు చదువుకున్న వారితోనే మళ్లీ ఇంటర్ చదువుకునే అవకాశం రావడం, ఇప్పటి వరకూ మాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులే మాకు లెక్చరర్లుగా రావడంతో భయం పోయింది. ఇంటర్ కూడా మా స్కూల్లోనే చదువుకోవడం ఆనందాన్ని ఇచ్చింది. బాగా కష్టపడి చదివి ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సిద్ధమయ్యాం. ఇంత ఆనందంగా ఇంటర్ పూర్తి చేసుకున్నామంటే అదంతా సీఎం జగన్ దీవెనలే.

ఇంటర్ వరకు ఇంటి దగ్గరే అన్నట్టుగా..



నా పేరు వులవకాయల చార్మి. మాది గొల్లప్రోలు మండలం చేబ్రోలు. నేను ఒకటో తరగతి నుంచి చేబ్రోలులోనే చదువుకున్నా. అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ మా ఇంటికి దగ్గరలోనే ఉన్నాయి. పదో తరగతి వరకూ అంతా ఇంటి దగ్గరే ఉన్నట్టు ఉండగా, ఇంటర్‌కు మాత్రం బయటకు వెళ్లక తప్పదని అనుకున్నా. అప్పటివరకు ఇంటి దగ్గరే చదువుకుని పక్క ఊరు వెళ్లాలంటే కొంచెం భయమేసేది. పదో తరగతి పూర్తయ్యే సరికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ఊరి స్కూల్‌ను జూనియర్ కాలేజీగా మార్చడంతో మాకు ఇబ్బందులు తప్పాయి. మా తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండాపోయింది. చాలా సంతోషంగా ఇంటి దగ్గరే ఇంటర్ పూర్తి చేసుకున్నాం.

ఇప్పుడు ఎక్కడైనా చదవగలం



నా పేరు దమ్ము సిరిదుర్గ. మాది గొల్లప్రోలు మండలం చేబ్రోలు. హైస్కూల్ చదివినంత వరకూ ఒక రకంగా చిన్న పిల్లలుగానే ఉంటాం. కాని ఇంటర్ అంటే వేరే లోకంలోకి వెళుతున్నట్టే. కొత్త ప్రదేశం, కొత్త ఊరు, కొత్త స్నేహితులు, ఇలా అన్నీ కొత్తగా ఉంటాయి. అలాంటి కొత్త లోకంలోకి అడుగు పెట్టాలంటే అందరికీ టెన్షన్ ఉంటుంది. అలాంటిది మాకు ఎలాంటి టెన్షన్ లేకుండా ఇంటర్ మా ఊళ్లోనే చదువుకునే వీలు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ప్రస్తుతం కాలేజీ అంటే భయం పోయి, ఇప్పుడు ఎక్కడికైనా వెళ్లి చదవగలం అనే ధైర్యం వచ్చింది.

దాడులకు నిరసనగా ధర్నా

కాకినాడ సిటీ: దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెరిగాయని, ఈ దాడులు హేయమైన చర్యలంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు హరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాగళాలపై జరుగుతున్న నిర్బంధ కాండను ప్రజలంతా వ్యతిరేకించాలని ఆందోళనకారులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎం రాజశేఖర్, కె బోడకొండ, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, తాళ్లూరి రాజు, తోకల ప్రసాద్, వల్లూరి రాజబాబు, టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, దూసర్లపూడి రమణరాజు, సీహెచ్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లోన్ పేరుతో మోసం

పిఠాపురం: బ్యాంకు లోన్లు ఇప్పిస్తానని నమ్మించి వారి నుంచి ఆధార్ కార్డు, ఫొటోలు సేకరించి, వారికి తెలియకుండా ఎక్కువ మొత్తంలో లోన్లు తీసుకుని మోసం చేసిన ఘటన పిఠాపురంలో చోటు చేసుకుంది. కాకినాడకు చెందిన చిన్ని అనే మహిళ తమను మోసం చేసి, తమ పేరున లోన్లు తీసుకుందని శుక్రవారం బాధితులు పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేయగా, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ విచారణ చేపట్టారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన మహిళా సంఘాల సభ్యులు గొల్లప్రోలు పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు.